

52 రోజుల పాటు హౌరా-గోవా రైళ్లు నిలుపుదల

నంద్యాల కల్చరల్, జనవరి 07 (ఆంధ్రజ్యోతి): కాజల్‌రాక్, కులం స్టేషన్లమధ్య రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల దృష్ట్యా జనవరి 16 నుంచి ఏప్రిల్ 18వ తేదీ మధ్య 52 రోజుల పాటు నంద్యాల మీదుగా వెళ్లే 18047-18048 నెంబరు గల హౌరా-గోవా రైళ్లను హుబ్లీ వరకు నిలిపేశారు. ఈ మేరకు దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ మణికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మద్దతు ఒట్టిదే..!





- సిఫారసులకు ఆమోదం లభించేనా.?
- పీఎం కిసాన్ రూ.12వేలకు పెంపు
- మద్దతు ధరలకు చట్టబద్ధత
- కేంద్రానికి సిఫారసు చేసిన పార్లమెంటు స్థాయి సంఘం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పశుసంవర్ధక ఆహార ప్రాసెసింగ్ రంగాలపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయి సంఘం రైతులకు మేలు చేసేలా సంచలన సిఫారసులు చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధర (ఎస్ఎ స్‌ఈ)లకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పంట సాగు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని సిఫారసుల్లో పేర్కొన్నారు. రైతుల దీర్ఘకాలిక డిమాండ్లపై స్థాయి సంఘం లోతైన అధ్యయనాన్ని ఇటీవల పూర్తి చేసింది. ఈ అధ్యయనాల నివేదికలను గత మంగళవారం పార్లమెంటులో సమర్పించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిజంగా ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తే రైతులకు చాలా మేలు జరుగుతుంది. ఇప్పటి దాకా కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పీఎం కిసాన్ పథకాన్ని రూ. 6వేల నుంచి రూ.12వేలకు పెంచాలని పార్లమెంటు స్థాయి సంఘం సిఫారసు చేసింది. అదే విధంగా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంట ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయిస్తూ వచ్చింది. అయితే.. ఖచ్చితంగా ఈ ధరలు రైతులకు లభించేందుకు చట్టబద్ధత కల్పించలేదు. నామ్‌కే వాస్తేగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొంటున్నాయి. దీనికి కూడా నానా రకాల నిబంధనలు పెట్టి రైతులకు మద్దతు ధర అందకుండా చేస్తున్నాయి. ఇటీవల దేశంలోని పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లోని రైతులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో పార్లమెంటు స్థాయి సంఘం రైతులకు సంతోషాన్ని ఇచ్చే సిఫారసులు చేయడం అన్నదాతలకు శుభపరిణామం అని చెప్పవచ్చు.

● కేంద్రం ఈ సంవత్సరానికి ప్రకటించిన మద్దతు ధరలు ఇవే:

పంట	క్వింటానికి మద్దతు ధర రూ.లలో
వేరుశనగ	రూ.6,760
పత్తి	రూ.7121
కంది	రూ.7550
మొక్కజొన్న	రూ.2225
పప్పుశనగ	రూ.6783
వరి	రూ.2320
జొన్న	రూ.3371
సజ్జ	రూ.2625
రాగులు	రూ.4290
పెసర	రూ.8682
మినుములు	రూ.7400
పొద్దుతిరుగుడు	రూ.7280
నువ్వులు	రూ.9267

● ఈ ధరలను ఖచ్చితంగా అమలు చేసేందుకు చట్టబద్ధత కల్పించాలని పార్లమెంటు స్థాయి సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వీటిని అమలు చేస్తే మద్దతు ధర కోసం వ్యాపారులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండదు.

ఈ సిఫారసులు అమలు చేయాలి



రైతులు పంట సాగులో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా కేంద్రం రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం. సాగు ఖర్చుల అనుగుణంగా సీఎం కిసాన్ మొత్తాన్ని రూ.12 వేలకు పెంచాలి. అలాగే నిర్ణయించిన మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి. పార్లమెంటు స్థాయి సంఘం సిఫార్సులను ప్రధాని మోదీ ఆమోదిస్తారని ఆశిస్తున్నాం.

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కరువు బృందం కోసం

నిరీక్షణ

- చివరికి రైతులకు నిరాశే
- జిల్లాలో కేంద్ర పర్యటన లేనట్లే

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్‌లో జిల్లాలోని కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం వస్తుందని, తమకు సాయం అందిస్తుందని రైతులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. చివరికి వారి నిరీక్షణ ఫలించదని తేలిపోయింది. ఖరీఫ్‌లో జిల్లాలో చాలా పెద్ద ఎత్తున తుఫాను నష్టం జరిగినా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెండు మండలాల్లోనే పంట నష్టం జరిగినట్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం కౌతాళం మండలంలో 21,169 మంది రైతులు 9,728 హెక్టార్లలో పత్తి, మిరప తదితర పంటలు నష్టపోయారు. వీరికి రూ.16.45 కోట్ల నష్టపరిహారాన్ని అందించాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను పంపారు. అదే విధంగా పెద్దకడుబూరు మండలంలో 13,872 మంది రైతులు 5,271 హెక్టార్లలో సాగు చేసిన పంటలు నష్టపోయారు. వీరికి రూ.8.78 కోట్ల పరిహారాన్ని అందించాలని నివేదికను పంపారు. ఈ రెండు మండలాల్లో 35,041 మంది రైతులకు 14,999 హెక్టార్లలో పంట నష్టానికి రూ.25.24 కోట్ల పరిహారం ఇవ్వాలని కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నష్టాన్ని పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి కేంద్ర బృందం త్వరలో వస్తుందని, తమకు జరిగిన పంట నష్టానికి పూర్తి సాయం అందుతుందని ఈ రెండు మండలాల రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే కేంద్ర బృందం అనంతపురంతో పాటు రాష్ట్రంలో వివిధ జిల్లాలో పంట నష్టాన్ని మూడు రోజులుగా పరిశీలిస్తున్నారు. తమ పంట నష్టాన్ని కూడా చూసేందుకు వస్తారని రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే కేంద్ర బృందం జిల్లాకు రావడం లేదని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు తెలపడంతో వారిలో నిరాశ మొదలైంది.

● నష్టపరిహారం అందుతుంది



జిల్లాలోని కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో రైతులు పంట నష్టానికి గురయ్యారు. కలెక్టర్ నివేదికను ప్రభుత్వానికి పంపించాం. కేంద్ర బృందం ఈ మండలాల్లో పంట నష్టాన్ని పరిశీలించేందుకు వివిధ కారణాల వల్ల రావడం లేదు. దీనికి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లా కలెక్టర్ పంపిన నివేది మేరకు ఆ మండలాల రైతులకు తప్పనిసరిగా పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తుంది.

- వరలక్ష్మి, జేడీ



ప్రారంభమైన ఉమూమి తబ్లిగీ ఇజితెమా

● భారీగా తరలివచ్చిన ముస్లింలు ● భద్రతా చర్యలను పరిశీలించిన ఎస్పీ

ఆత్మకూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు కేంద్రంగా మూడు రోజుల పాటు జరిగే ఉమూమి తబ్లిగీ ఇజితెమా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీశైలం రస్తాలోని సుమారు వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇజితెమా ప్రాంగణానికి కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. మధ్యాహ్నం ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు ఆధ్మాత్మిక ప్రవచనాలను, మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను వినిపించారు. తొలిరోజు మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళల్లో ముస్లింలు ప్రార్థనలు చేపట్టారు. ఇదిలావుంటే వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికోసం ఇజ్‌తెమా నిర్వహణ కమిటీ భారీ ఏర్పాట్లను సిద్ధం చేసింది. వంద ఎకరాల్లో ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు నమాజులు చేసుకునేందుకు వీలుగా సదుపాయాలను కల్పించారు. అలాగే విద్యుద్దీకరణతో పాటు భారీ ఫ్లడ్‌లైట్లను అమర్చారు. అదేక్రమంలో సుమారు 5వేల మరుగుదొడ్లు, స్నానపుగదులు, 17భోజన కౌంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆయా రూట్లలో 18చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌జామ్ సమస్య వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో బస్టాండ్‌కు చేరుకున్న వారికి ప్రత్యేక వాహనాల్లో ఇజితెమా ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు కల్పించారు. కాగా మంగళవారం రాత్రికి ఇజితెమా ప్రాంతానికి అధిక సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. బుధవారం ఉదయం నుంచి భారీ స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వహణ కమిటీ సభ్యులు వెల్లడించారు.



ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న ఉలేమాలు



ఇజితెమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఆధిరాజ్‌సింగ్‌రాణా

భద్రతా చర్యలను పరిశీలించిన ఎస్పీ

ఆత్మకూరులో జరుగుతున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా సందర్భంగా భద్రతా ఏర్పాట్లను నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కింగ్ ప్రదేశాలను, పోలీసు కంట్రోల్ రూమ్‌ను సందర్శించి బందోబస్తు ఏర్పాట్ల గురించి ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తబ్లిగీ ఇజితెమా కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సుమారు 400 మంది పోలీసు అధికారులు, సిబ్బంది రెండు విడతల వారీగా విధుల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఎస్పీ వెంట సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

-కలెక్టర్ రాజకుమారి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 26వతేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఎస్‌పి శ్రీనివాసరెడ్డిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలకు కళాశాల మైదానాన్ని తీర్చిదిద్దడంతో పాటు జాతీయ పతాక ఆవిష్కరణ, పరేడ్ మార్చ్ ఫాస్ట్‌లో సాయుధ దళాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వేదిక, విఐపిలు, అధికారులు, ప్రజలు, విద్యార్థులు కూర్చొనేందుకు ఎండ తగలకుండా పెండాల్స్ సీటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌వీ, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు శాఖలకు రోలింగ్ షీట్‌లు బహూకరిస్తామన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే తక్కువ నిడివి గల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వ్యవసాయం, డీఆర్డీఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, వ్యవసాయ అనుబంధ రంగాలు తదితర అన్ని సంక్షేమ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రామునాయక్, సీపీవో వేణుగోపాల్, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ జనార్ధన్‌రావు, డీఎంహెచ్ఓ డా. వెంకటరమణ, డీఈఓ జనార్దన్‌రెడ్డి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులకు మోక్షం

- రూ.241.99 కోట్లతో ఆదోని బైపాస్ రోడ్డు
- రూ.607 కోట్లతో సంగమేశ్వరం-నల్లకాలువ, వెలుగోడు-నంద్యాల రెండు లైన్ల రహదారి
- కర్నూలు-డోన్ డబ్లింగ్ పనులకు కూడా
- నేడు విశాఖ నుంచి వర్చువల్‌గా ప్రధాని శంకుస్థాపన




కర్నూలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో రూ.848.99 కోట్లతో చేపట్టే రెండు ప్రధానమైన జాతీయ రహదారులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో 20 జాతీయ రహదారులు, రైల్వే డబ్లింగ్ పనులకు శంకుస్థాపన, మరో పది పనులు ప్రారంభోత్సవం కోసం ప్రధాని మోదీ నేడు విశాఖపట్నం రానున్నారు. అక్కడి నుంచి జిల్లాలో నిర్మించబోయే పనులకు వర్చువల్ ద్వారా భూమిపూజ చేస్తారని నేషనల్ హైవే విభాగం కర్నూలు ఈఈ శంకర్‌రెడ్డి మంగళవారం ఆంధ్రజ్యోతికి వివరించారు.

మిగతా 6వలో...

నంద్యాల సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

- ఎనీవేర్‌లో అక్రమ రిజిస్ట్రేషన్
- గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు
- సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఉత్తర్వులు



నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఇన్‌సెట్‌లో) సబ్‌రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్

నంద్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు వివాదంలో ఉన్న ఓ ఇంటి స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారన్న అభియోగాల నేపథ్యంలో నంద్యాల సబ్ రిజిస్ట్రార్ నాయక్ అబ్దుల్ సత్తార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కళ్యాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌తో పాటు కేసు విషయం తేలే దాకా జిల్లాను వదిలి ఎక్కడికి వెళ్లకూడదంటూ షరతులు విధించారు. కడప జిల్లాలోని పొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ మహిళకు ఐదుగురు కుమారులు. వారిలో ఇద్దరు కుమారులకు మాత్రమే గతంలో ఆమె స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసింది. దీంతో మిగిలిన ముగ్గురిలో ఒకరు ఆ స్థలంలో వాటా ఉందని వారితో తరచూ గొడవకు దిగేవాడు. అంతటితో ఆగకుండా సదరు స్థలంపై కోర్టును ఆశ్రయించాడు. వివాదం కోర్టు పరిధిలో ఉండగానే సదరు స్థలాన్ని తల్లితో కలిసి ఇద్దరు కుమారులు గుట్టుగా గతేడాది నవంబరు 24వ తేదీన విక్రయించారు. చివరకు కోర్టుకు వెళ్లిన వ్యక్తి కోర్టు స్టేటస్‌కో పత్రాలతో డీఐజీకి ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ ఆదేశాలతో ఆగమేఘాలపై డీఐజీ కళ్యాణి సదరు స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్, కోర్టు ఉత్తర్వులు తదితర వివరాలను సమగ్రంగా పరిశీలించారు. కోర్టు వివాదంలో ఉన్నప్పటికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని నిర్ధారణకు వచ్చారు. దీంతో సదరు సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయడం జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది.

గతంలోనూ ఆరోపణలు..?

ఎక్కడైనా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా..ఏలాంటి సేవలైనా పొందాలన్నా.. కాసులు ఇవ్వందే పని జరగదనే విషయం అందరికి తెలిసిందే. ఇదే క్రమంలో సదరు సబ్ రిజిస్టర్‌పై కూడా ఈ కోర్టు వివాదం స్థలం రిజిస్ట్రేషన్ విషయమే కాదు.. ఆయన గతంలో పనిచేసిన ఎక్కడ చూసి ఇదే తరహాలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని సమాచారం. ఈ స్థలం రిజిస్ట్రేషన్ విషయంలోనూ మామూళ్లు తీసుకుని చక్కదిద్దారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆళ్లగడ్డలో పనిచేసిన సమయంలో కూడా నంద్యాలకు చెందిన పలు స్థలాలు, భూములు ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద రిజిస్ట్రేషన్ చేసి పెద్దఎత్తున సొమ్ముచేసుకున్నారనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా నంద్యాలకు సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన సమయంలో కూడా రియల్టర్లు, బిల్డర్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులతో కూడా పెద్దఎత్తున వసూళ్లు చేసి క్యాష్ చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అసోసియేషన్ అడ్డుగా దోపిడీ..?

ఈయన సుదీర్ఘకాలం కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువ కాలం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేయడంతో పాటు ఆ శాఖ సబ్ రిజిస్ట్రార్ల రాష్ట్ర అసోసియేషన్‌లో కీలక పదవిలో ఉన్నారు. ఏళ్ల తరబడి అసోసియేషన్‌లో ఉండటంతో ఆశాఖ ఉన్నతాధికారులతో కూడా సాన్నిహిత్యం ఎక్కువగా ఉండటంతో తన పైరవీలకు ఎంతగానో కలిసివచ్చినట్లైంది. ఇదే క్రమంలో ఇటీవల జరిగిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో కూడా రూ.లక్షల్లో వసూళ్లు చేశారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ వ్యవహారంలో ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో పనిచేస్తున్న కొందరు సబ్ రిజిస్ట్రార్లతో పాటు ఓ సూపరింటెండెంట్ పాత్ర కూడా ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. మొత్తంగా కోర్టు వివాదంలో ఉన్న స్థలం రిజిస్ట్రేషన్.. ఈయన పనితీరు తదితర అంశాల పరంగా చూస్తుంటే తీగ లాగితే.. డొంక కదులుతుందన్న విధంగా సబ్ రిజిస్ట్రార్ వ్యవహారం ఉన్నట్లు హాట్ టాపిక్‌గా నడుస్తోంది.

ఆ శాఖ వర్గాల్లో కలకలం

కోర్టు వివాదం స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారంలో భాగంగా సదరు సబ్ రిజిస్ట్రార్‌ను ఆ శాఖ డీఐజీ కళ్యాణి సస్పెన్షన్ చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశాఖ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇదే క్రమంలో కొన్ని రోజుల కిందట రూ. కోట్లు విలువ చేసే భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ గుట్టురట్టు కావడం.. బాధ్యులను సస్పెన్షన్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడంతో ఆశాఖ వర్గాలను కలవరపాటుకు గురిచేసినట్లైంది. అంతేకాకుండా ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ సమయంలో ఎక్కడ ఎవరిపై ఏలాంటి చర్యలు ఉంటాయోనని ఆశాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వెంచర్..!

- చిన్నటేకూరు సర్వే నెం-1లో భూమి ఆక్రమణ
- లేఅవుట్ వేసి అనుమానం రాకుండా హద్దురాళ్లుగా మొక్కలు
- గ్రావెల్ తోలి చదును చేసి రోడ్డు వేసిన అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ శాఖ



కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తూ వెంచర్లు వేసి లక్షల రూపాయలకు విక్రయించేస్తున్నారు. ఇటీవలి కాలంలో కబ్జాపర్వం అధికమవుతోంది. తాజాగా ఇలాంటి ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. కొందరు కబ్జాదారులు ఏకంగా ప్రభుత్వ భూమిలోనే వెంచర్ వేసి విక్రయాలకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్లూరు మండలం చిన్నటేకూరు సర్వే నెంబరు 1లో 130 ఎకరాల హంద్రీపోరం బోకు భూమి ఉంది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో, జగన్నాథగట్టు ట్రిపుల్ ఐటీ, జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర రూ.కోట్లలో పలుకుతోంది. దీంతో ప్రభుత్వ భూమి కనపడితే చాలు అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ, వక్ఫ్, నది పోరంబోకు భూమిలో రూ.కోట్లు విలువ చేసే భూములను కొట్టేసి గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం చేస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో సర్వే నెంబరు 1లో హంద్రీ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైంది. దాదాపు 4 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కులు దర్జాగా ఆక్రమించి... ప్రైవేటు వెంచర్ వేసిన సంఘటన వెలుగు చూసింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారుల్లో చలనం లేకుండా పోయిందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హంద్రీనది పోరంబోకు భూములు ఆక్రమణకు గురికాకుండా రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



డిసెంబరు 23న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

లేఅవుట్ వేసి హద్దు రాళ్లుగా మొక్కలు


హంద్రీనది పోరంబోకు భూమి ఆక్రమించడమే కాక చదును చేసి లేఅవుట్‌తో అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పేపర్‌పై లేఅవుట్ తయారు చేసి క్రయ, విక్రయాలు జరిపినట్లు ఇప్పటికే దాదాపు రెండు రూ.కోట్ల మేర దందా జరిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. అధికారుల అండదండలతోనే హంద్రీనది పోరంబోకు భూమి ఆక్రమణ జరుగుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుని అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. చిన్నటేకూరు గ్రామంలో ఓవ్యక్తి సర్వే నెం-1లోని హంద్రీనది పోరంబోకు భూమిలో ప్లాట్లు వేసి హద్దురాళ్లుగా మొక్కలు నాటినట్లు చిన్నటేకూరు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోక పోవడంతో గ్రామస్థులు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు డిసెంబరు 23న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వినతిని కల్లూరు తహసీల్దారుకు విచారణ నిమిత్తం పంపారు. దాదాపు 15 రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆక్రమణకు గురికాకుండా రక్షణ బోర్డు ఏర్పాటు

చిన్నటేకూరు సర్వే నెంబరు 1లోని హంద్రీనది పోరం బోకుభూమి ఆక్రమణకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. రెవెన్యూ గ్రామసభలు ఉన్నందున చర్యలు తీసుకోవడంలో కొంత ఆలస్యమైంది. వెంచర్ వేసిన ఆ భూమి ప్రభుత్వానిదే. ప్రజలు ప్లాట్లు కొని మోసపోవద్దు. తక్షణమే ఆక్రమణ భూమిలో రక్షణ బోర్డు ఏర్పాటు చేస్తాం. అలాగే ఉలిందకొండ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, భూ ఆక్రమణకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతాం.

- కె.ఆంజనేయులు, తహసీల్దారు, కల్లూరు



చిన్నటేకూరు గ్రామం వద్ద హంద్రీనది పోరంబోకు భూమిలో వేసిన గ్రావెల్ రోడ్డు

ముక్కోటి ఏకాదశి వేడుకలు

- రాష్ట్ర స్థాయి బండలాగుడు, కబడ్డీ పోటీలు

బేతంచెర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్దిలేటి స్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని రైతు సంబరాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో 6 పండ్ల ఎద్దుల విభాగంలో విజేతలకు మొదటి నుంచి వరుసగా 8 బహుమతులు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు దాతల సహకారంతో ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

● 10న రాష్ట్ర స్థాయి పెద్ద బండలాగుడు పోటీలు: ఈ నెల 10న న్యూకేటగిరీ ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి నుంచి 9 బహుమతులు రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

● జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు: ఏకాదశి వేడుకల సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో విజేతలకు మొదటి నుంచి వరుసగా 5 బహుమతులు రూ.15వేలు, రూ.12వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.3వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. పాల్గొనే జట్లు తమ పేర్లను సెల్‌ఫోన్స్ 9160638848, 9652297198, 9014590115 సంప్రదించాలని తెలిపారు.

వందేళ్ల ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి

ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు



శ్రీరామ విగ్రహ భూమి పూజ చేస్తున్న ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని శ్రీరామాలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాలు ఆలయ విశిష్టతను చాటిచెప్పేలా ఘనంగా నిర్వహించాలని ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు అన్నారు. మంగళవారం ఆలయంలో నిర్మిస్తున్న 20 అడుగుల శ్రీరామ విగ్రహ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వప్రసన్న తీర్థులు మాట్లాడుతూ నగరంలో అతి ప్రాచీనమైన ఈ ఆలయ విశిష్టత ఎంతో ఉందని చెప్పారు. ఆలయ మొదట అర్చకత్వం వహించిన తర్క విద్వాన్ మాళిగి రామ్మూర్తి ఆచార్యుల వారికి తమ గురువులైన విశ్వేశతీర్థ శ్రీపాదలకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి హనుమేశాచార్యులు మాట్లాడుతూ 1921 నుంచీ 1971 వరకు తమ పూర్వీకులు, ఆ తర్వాత తాను బాధ్యతలు చేపట్టానని అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 12 నుంచి 18 వరకు సప్తరాత్రి శతాబ్ది బ్రహ్మోత్సవాలు ఆలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాలను భక్తులంతా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు మాళిగి వ్యాసరాజ్, వీహెచ్‌పీ నాయకులు సందడి మహేష్, మాళిగి భానుప్రకాశ్, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చిల్కూరు ప్రభాకర్, విఠల్‌శెట్టి, విఠల్‌రావు, చంద్రకాంత్, జయతీర్థ, వేదవ్యాస్, సత్యప్రియ, నీలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ముగ్గురు ప్రమాణ స్వీకారం

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన ముగ్గురు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం విజయవాడలోని బీసీ వెల్ఫేర్ భవన్‌లోని కార్పొరేషన్ ఛాంబర్‌లో వాల్మీకి బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. కోడుమూరుకు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ నాయుడు, కర్నూలుకు చెందిన టీడీపీ నాయకురాలు సంజీవలక్ష్మి, కర్నూలుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు తోళ్ల మంజునాథ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మురళీనాయుడు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆర్.గోపీ శ్రీనివాస్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠకు కృతజ్ఞతలు తెలియజేశారు.



డైరెక్టర్లుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

సీమకు ఉజ్వల భవిష్యత్తు: మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : బనకచర్ల-గోదావరి అనుసంధానంతో రాయలసీమకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుదని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల రూరల్ తహసీల్దారు కార్యాలయాన్ని మంత్రితో పాటు కలెక్టరు రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమ చివరి భూములకు నీరుపారించాలన్న తపనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోదావరి- బనకచర్ల అనుసంధాన నిర్ణయం తీసుకున్నారన్నారు. జిల్లాలో పెరుగుతున్న అవసరాల దృష్ట్యా నంద్యాల రెవెన్యూ కార్యాలయాన్ని రెండుగా విభజించి రూరల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి అన్ని కార్యాలయాలు ఒకే ప్రదేశానికి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మండలంలో 20 రెవెన్యూ గ్రామాలున్నాయన్నారు. ఇతర సర్వీసులకు సంబంధించిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో రూరల్ మండల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు.



రూరల్ తహసీల్దారు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

దేవరకు వేళాయె...

- ఐదేళ్ల తర్వాత కోసిగిలో మారెమ్మ ఉత్సవాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- దేవరకు ముస్తాబైన పొట్టేళ్లు
- నేటి నుంచి దేవర ప్రారంభం

కోసిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహాదేవరకు కోసిగి గ్రామం ముస్తాబైంది. ఐదేళ్ల తర్వాత జరుగుతున్న దేవర సందర్భంగా కోసిగిలోని కింది మారెమ్మ దేవాలయం, ముసలి మారెమ్మ దేవాలయం సిద్దప్ప పాలెం మారెమ్మ దేవాలయం, సుంకులమ్మ దేవాలయం, నాడిగేని గేరి మారెమ్మ దేవాలయం కట్టా, రంగప్పగట్టు మారెమ్మ దేవాలయం, గాంధీనగర్‌లోని మారెమ్మ, ఒకటోవార్డులోని సుంకులమ్మ ఆలయ కమిటీ పెద్దలు ఆలయాలను ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలంకరణలో మారెమ్మ దేవాలయాలు వెలిగిపోతున్నాయి. బుధవారం నుంచి జరిగే దేవర సందర్భంగా పొట్టేళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. రూ.లక్షలు విలువ చేసే పొట్టేళ్లను దేవర వేడుకల కోసం పోటీ పడి మరీ ప్రజలు ఉత్సవాలకు సిద్ధం చేసుకున్నారు. సిద్దప్పపాలెం మారెమ్మ దేవాలయం, కింది మారెమ్మ దేవాలయం, ముసలి మారెమ్మ దేవాలయాలను పుష్పాలంకరణతో అలంకరించి ఆలయ కమిటి పెద్దలు ముస్తాబు చేశారు. దేవర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ముసలి మారెమ్మ అమ్మవారికి గజమాలతో, కలశాలతో వెళుతున్న వాల్మీకినగర్ వాసులు



దేవర వేడుకలకు పొట్టేళ్లు



విద్యుద్దీపాలతో కోసిగిలోని ప్రధాన వీధులు

10న కర్నూలుకు మంత్రి నారా లోకేశ్



కర్నూలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ 10వ తేదీ శుక్రవారం కర్నూలుకు రానున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టీజీ శిల్పా దంపతుల కుమార్తె టీజీ శ్రీఆర్యాపాన్య ప్రముఖ వ్యాపారవేత్త బొమ్మిడాల రాజా, రమాదేవి దంపతుల కుమారుడు బొమ్మిడాల వెంకటశ్రీ నలిన్‌ల వివాహం డిసెంబరు 26న హైదరాబాద్‌లోని జరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 10వ తేది శుక్రవారం స్థానిక ఎస్‌ఏపీ క్యాంప్‌లో ఉదయం 11 గంటలకు రిసెప్షన్ నిర్వహించనున్నారు. ఈ ఫంక్షన్‌కు ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు. ముందు రోజు 9వ తేదీ గురువారం అనంతపురం జిల్లా పర్యటనను ముగించుకొని రాత్రి 11 గంటలకు కర్నూలు నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి 10వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రభుత్వ కళాశాలలను పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఎస్‌ఏపీ క్యాంప్ మైదానం చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం 1:30 గంటలకు కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

రహదారులకు మోదీ శంకుస్థాపన

(5వ పేజీ తరువాయి)

కర్ణాటక రాష్ట్రం బళ్లారి సమీపంలోని హగరి నుంచి ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, రాయచూరు మీదుగా జాతీయ రహదారి-167 2012-13లో నిర్మించారు. ఆదోని పట్టణంలో ఈ జాతీయ రహదారి వెళ్తుంది. ట్రాఫిక్ సమస్యలు దృష్ట్యా ఆదోని-ఆలూరు రోడ్డు నుంచి ఆదోని-పత్తికొండ రోడ్డు దాటి ఆదోని-ఎమ్మిగనూరు రోడ్డును కలుపుతూ 7.3 కి.మీల బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 10 మీటర్ల తారు (బీటీ) రోడ్డు, రెండు వైపుల రెండు మీటర్లు మట్టిరోడ్డు (సోల్డర్) కలిపి 12 మీటర్లు వెడల్పుతో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రూ.241.99 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు ప్రధాని మోడీ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయబోతున్నారు.

● సంగమేశ్వరం-నంద్యాల నేషనల్ హైవేకు భూమి పూజ: తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ భారతమాల ప్రాజెక్టులో భాగంగా కల్వకుర్తి - నంద్యాల వయా ఆత్మకూరు 170 కి.మీలు జాతీయ రహదారి - 167కే నిర్మాణానికి కేంద్ర జాతీయ రాహదారుల మంత్రిత్వ శాఖ 170 కి.మీల రోడ్డు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు అవసరమైన నిధులు కూడా మంజూరు చేసింది. అందులో భాగంగానే నంద్యాల జిల్లాలో సంగమేశ్వరం-నల్లకాలువ వయా ఆత్మకూరు, వెలుగోడు-నంద్యాల వరకు 62 కి.మీలు 12 మీటర్లు (10 మీటర్ల బీటీ రోడ్డు) రెండు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి రూ.607 కోట్లతో టెండర్లు కూడా పూర్తి చేశారు. ఈ పనులకు నేడు ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా భూమి పూజ చేసి శిలాఫలకం వేస్తారు. ఈ రహదారిలో భాగంగా సంగమేశ్వరం చెంత కృష్ణా నదిపై 900 మీటర్లు పొడవు పర్యాటకులను ఆకట్టుకునేలా ఐకాన్ తీగల వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దాదాపు రూ.400 కోట్లతో నిర్మించే ఈ ఐకానిక్ తీగల వంతెన నిర్మాణం పనులు తెలంగాణ రాష్ట్రం చేపట్టబోతుంది. ప్రస్తుతం టెండర్ల దశలో ఉందని ఇంజనీర్లు పేర్కొన్నారు. నేషనల్ హైవే-167కే, ఐకానిక్ తీగల వంతెన నిర్మాణం పూర్తి అయితే నంద్యాల, కడప జిల్లాల ప్రజలు, వాహనదారులు హైదరాబాద్‌కు వెళ్లాలంటే దాదాపు 70 కి.మీల వరకు దూరం తగ్గుతుందని ఇంజనీర్లు పేర్కొన్నారు.



● కర్నూలు-డోన్ డబ్లింగ్ రైల్వే లైన్: కాచిగూడ (హైదరాబాద్)-డోన్ ప్రధాన రైల్వే మార్గం. డబ్లింగ్, విద్యుదీకరణ రైల్వేలైన్‌గా ఆధునికీకరణ చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదన ఉంది. ఇప్పటికే మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్-డోన్ వయా గద్వాల, కర్నూలు, వెల్దుర్తి మీదుగా డబ్లింగ్ లైన్, విద్యుదీకరణ పనులు చేపట్టాలి. 197 కి.మీల ఈ పనులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ రూ.2,208 కోట్లు కేటాయించింది. టెండర్లు కూడా పూర్తి చేసిందని అధికారులు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో కర్నూలు - డోన్ వయా వెల్దుర్తి మీదుగా జిల్లాలో 54 కి.మీలు డబ్లింగ్ రైల్వే లైన్, విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు ప్రధాని నేడు విశాఖ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు.



దొంగ దొరకలేదు

- పట్టుకోకుంటే వేటు తప్పదు
- ఆదోని త్రీ టౌన్ పోలీసులపై ఎస్పీ సీరియస్?



మురళి (ఫైల్)

ఆదోని రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో కోర్టుకు తరలిస్తుండగా అంతర్రాష్ట్ర దొంగ మురళి ఖాకీల కళ్లు కప్పి, కోర్టు గోడ దూకి పరారైన విషయం విదితమే. అయితే దొంగ దొరకలేదు. నాలుగు రోజుల క్రితం ఎమ్మిగనూరు బైపాస్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న మురళిని పట్టుకొని స్థానికులు పోలీసులకు అప్పజెప్పారు. సోమవారం త్రీటౌన్ పోలీసులు దొంగను కోర్టుకు తరలిస్తుండగా, కోర్టు ఆవరణలో పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎస్పీ మంగళవారం ఉదయం సెట్ కాన్ఫరెన్స్‌లో త్రీటౌన్ పోలీసులపై సీరియస్ అయినట్లు నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, దొంగను 24 గంటల్లోపు పట్టుకోకపోతే ఆ ఇద్దరి సిబ్బందిపై వేటు తప్పదని ఎస్పీ హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ శివభూషణం వివరణ కోరగా, దొంగ దొరకలేదని, సిబ్బంది గాలిస్తున్నారని చెప్పారు.

మహిళ ఆత్మహత్య

ఆదోని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరాఠీగేరి కాలనీకి చెందిన శ్వేత(22) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. శ్వేతకు మూడేళ్ల క్రితం నాగరాజు అనే వ్యక్తితో ప్రేమ వివాహమైంది. అయితే నాగరాజు జల్సాలకు అలవాటు పడడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ భారం అవుతోందని శ్వేత పలుమార్లు భర్త నాగరాజుకు చెప్పినా మార్పు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. శ్వేత తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు సత్తార్ వలి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో రైతు...

డోన్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెంపల్లె గ్రామానికి చెందిన రైతు బోయ సుధాకర్ (42) అప్పులబాధ తాళలేక మంగళవారం తెల్లవారుజామున పొలంలోనచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. మల్లెంపల్లె గ్రామానికి చెందిన బోయ సుధాకర్‌కు గ్రామంలో రెండెకరాలు సొంత పొలం ఉండగా.. మూడెకరాలు కౌలుకు తీసు కుని సాగు చేసుకుంటున్నారు. మూడేళ్లుగా వేసిన వేరుశనగ, పత్తి తదితర పంటలు సరైన దిగుబడి రాలేదు. రూ.10 లక్షలకు పైగా అప్పు ఉంది. దీంతో అప్పులు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుధాకర్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.



సుధాకర్ (ఫైల్)

వలస కార్మికుడు..

వెల్దుర్తి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఇటుకల బట్టీ కర్మాగారంలో పని చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు దుర్యోధన్ బెహరా (42) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దుర్యోధన్ బెహరా కొన్నేళ్లుగా రవి ఇటుకల బట్టీలో వలస కార్మికుడిగా పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పని చేశారు. మధ్యాహ్నం భోజనం విరామం తర్వాత కనపడకపోవ డంతో తోటి కార్మికులు వెతికారు. సమీపంలోని వంకలో చెట్టుకు తన తల పాగాతో ఉరి వేసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని కిందకు దించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. దుర్యోధన్ భార్య భానుమతి బెహరాకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఆయనకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన దుర్యోధన్ బెహరా

చికిత్స పొందుతూ మృతి

బనగానపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన బిల్ కలెక్టర్ పుష్పావతి పుల్లయ్య(62) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పుల్లయ్య పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టరుగా కాంట్రాక్ట్ బేసిస్ మీద పని చేసున్నారు. అప్పులు అధికం కావడం తాగుడుకు బానిసై ఉద్యోగ జీతం సరిపోలేదని మనస్తాపం చెంది పలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పుల్లయ్య కుమారుడు సురేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

పత్తికొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువలదొడ్డి గ్రామానికి చెందిన దంపతులు బాలకృష్ణ, మహేశ్వరి ఆత్మహత్యాయత్నం చేశారు. భార్యాభర్తలిద్దరూ మంగళవారం పొలానికి వెళ్లారు. పొలం వద్ద బాలకృష్ణ పురుగుల మందు తాగి అచేతనంగా పడి ఉండడంతో బంధువులు గుర్తించి పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. భార్య ఇంటి వద్ద లేకపోవడంతో గాలింపు చేపట్టారు. అయితే పత్తికొండ చెరువు సమీపంలో కొళాయి బావి వద్ద ఆమె కూడా పురుగుల మందు తాగి అచేతనంగా పడి ఉన్నారు. ఆమెను కూడా పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య నియంత్రణ పనులకు ఆమోదం

కర్నూలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కింద కర్నూలు నగరంలో రూ.7.87 కోట్లతో కాలుష్య నియంత్రణకు వీలుగా అభివృద్ధి పనులకు కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆమోదం తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కాలుష్య నియంత్రణలో భాగంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కు సంబంధించి జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా కర్నూలు నగరంలో గాలి నాణ్యత పెంచేందుకు వీలుగా పలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ బస్టాప్ దాకా ఉన్న రోడ్లకు ఇరువైపులా డస్ట్ లేకుండా మొత్తం తారురోడ్డు వేయాలని (ఎండ్ టూ ఎండ్ పేయింగ్ ఆఫ్ రోడ్స్) ఆదేశించారు. సీ.క్యాంపు నుంచి విజ్ఞాన్ మందిర్ వరకు విశ్వేశ్వర య్య సర్కిల్ నుంచి రైతుబజారు వరకు, విజ్ఞాన్ మందిర్ నుంచి బీ.క్యాంపు ఆటో స్టాండు వరకు కూడా ఇదే విధంగా రోడ్లకు ఇరువైపులా డస్ట్ లేకుండా మొత్తం తారురోడ్డు వేయాలని ఆదేశించారు. అదే విధంగా ఉల్చాల జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు ప్లాంటేషన్ చేపట్టాలని, కిసాన్‌నగర్ పార్కులో పచ్చదనం పెంచాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.వెంకట కిషోర్ రెడ్డి, డీటీసీ శాంత కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భర్తీ నోటిఫికేషన్ రద్దు

కర్నూలు హాస్పిటల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఫిబ్రవరిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. నిర్మల ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నోటిఫికేషన్‌ను పరిపాలన కారణాల వల్ల రద్దు చేసినట్లు తెలిపారు.

సీజ్ చేసిన ఇసుకకు అనుమతులు

- కాంట్రాక్టర్‌తో వీఆర్వో కుమ్మక్కు
- అనుమతి లేకుండా వాడకం
- వీఆర్వోపై అనుమానాలు
- అక్రమంగా ఇసుకను నిల్వ చేసింది ఎవరు ?



కర్నూలు - బళ్లారి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇసుక డంపు

కోడుమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటించగానే అవసరం ఉన్నా లేకున్నా ఇసుక అక్రమార్కులు కోడుమూరులోని హంద్రీ నది లోంచి ఇసుకను తరలించి ఎక్కడ పడిలే అక్కడ ఇసుకను డంప్ చేసి పెట్టారు. దీనిపై గత ఏడాది డిసెంబరు 5న ఇసుక మస్కా అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం అయింది. పట్టణం లోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలో అక్రమ ఇసుక నిల్వను ఉన్నట్లు పోలీసులు గుర్తించి టన్నుల కొద్ది ఉన్న ఇసుక నిల్వను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రెవెన్యూ సమక్షంలో ఉన్న ఇసుక ఎలాంటి అనుమతులు లేకుండా ఒక కాంట్రాక్టర్ రోడ్డు కల్వర్టు పనులకు ఉపయోగించడం పట్ల పలు అనుమానాలు వస్తున్నాయి. ఒక వీఆర్వో కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఇసుక అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది. పోలీసులు మూడు ఇసుక డంపులను సీజ్ చేయాలని మైనింగ్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇసుక డంపులను అంచనా వేసేం దుకు వచ్చిన మైనింగ్ అధికారులను తప్పుదోవ పట్టించిన వీఆర్వో రెండు డంపులను మాత్రమే సీజ్ చేయించినట్లు తెలిసింది. సదరు వీఆర్వో మైనింగ్ అధికారులనే కాకుండా పోలీసులు, తహసీల్దార్ బురిడీ కొట్టించాడన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కర్నూలు, బళ్లారి రోడ్డు ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇసుక డంపును సీజ్ చేయించకుండా ప్రజలకు కనిపించని రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేయించినట్లు తెలిసింది. ఇందు కోసం కాంట్రాక్టర్ నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు అందుకొన్నాడనే ఆరోపణలు ఉన్నాయి. సీజ్ చేసిన ఇసుక వాడకం అనుమతులపై ఇదేమిటని సదరు వీఆర్వోను ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు ఇసుక డంపులను మాత్రమే సీజ్ చేశామని, మూడో ఇసుక డంపును సీజ్ చేయలేదని జవాబు ఇచ్చారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి సదరు వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. గతంలో కూడా సదరు వీఆర్వోపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల అండ ఉందని ఈయన అవినీతికి అంతులేదనే విమర్శలు వచ్చాయి.

ఇసుక అక్రమ నిల్వ చేసింది ఎవరు ?


అధికారులు ఎంతసేపు అక్రమంగా డంపు చేసిన ఇసుకను సీజ్ చేసేందుకు ఆసక్తి చూపించారేగాని ఇంతకూ ఇసుకను నిల్వలు చేసింది ఎవ్వరు ? అనే దాన్ని పట్టించుకోలేదు. దీని పట్ల పలు అనుమానాలు ఉన్నాయి. అక్రమంగా హంద్రీనదిలోంచి ఇసుక డంపు చేసిన వాళ్లపై ఎందుకు కేసులు నమోదు చేయలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విచారిస్తాం

సీజ్ చేసిన ఇసుకను వాడుకోవడానికి ఎవ్వరికీ అనుమతి ఇవ్వలేదు. అలాగే మరో ఇసుక డంపును ఎందుకు సీజ్ చేయలేదో విచారిస్తాం. - **రామాంజనేయులు, డీటీ, కోడుమూరు.**

ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ యం. ఉమాపతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ యం. ఉమాపతి

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మంగళవారం కర్నూలు విద్యుత్‌భవన్‌లోని సమావేశ మందిరంలో చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం. ఉమాపతి, కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి. శేషాద్రి పాల్గొన్నారు. విజయవాడలో నిర్వహించిన బహిరంగ, వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు హాజరై అభ్యంతరాలను తెలియపరిచారు. బుధవారం కూడా విజయవాడలో విద్యుత్ టారిఫ్‌పై ప్రజల అభిప్రాయాలు, సూచనలను తెలుసుకుంటారు. అదేవిధంగా ఈనెల 10న కర్నూలులోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో విద్యుత్ టారిఫ్‌పై నిర్వహించే ప్రజా అభిప్రాయ సేకరణలో ప్రజలు సూచనలు, సలహాలు, అభ్యంతరాలను తెలియజేయాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం.ఉమాపతి తెలిపారు. టెక్నికల్ ఈఈ ఓబులేసు, ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



మంత్రి బీసీతో జడ్పీ సీఈవో నాసరరెడ్డి

బనగానపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. బనగానపల్లె పట్టణంలోని మంత్రి బీసీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జడ్పీ సీఈవో నాసరరెడ్డితో పాటు పలువురు అధికారులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధిపై చర్చించారు. మంత్రిని కలసిన వారిలో జిల్లా అటవీశాఖ అధికారులు ఉన్నారు. బేతంచెర్ల మండలం ఘన మద్దిలేటిస్వామి ఆలయం సిబ్బంది, ఆలయ ఈవోలు కలిసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే సెంట్రల్ పవర్ గ్రిడ్ గుత్తి డివిజన్ డీజీఎం, జీఎంలు, జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్ కుమార్, కర్నూలు జిల్లా ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.భూపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మంత్రిని కలిశారు.

మోదీ గో బ్యాక్

- వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- సీపీఎం ర్యాలీ, ధర్నా



నగరంలోని కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్టని ప్రధాన మంత్రి మోదీ గో బ్యాక్ అంటూ సీపీఎం నాయకులు వ్యతిరేకించారు. రాష్ట్ర అభివృద్ధి పట్టని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం నగర కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ ఆవరణ నుంచి రాజవిహార్, మెడికల్ కాలేజీ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విభజన హామీలు అమలు చేయాలి, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.. అంటూ నినాదాలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం పేరుతో రాష్ట్రానికి రాబోతున్న నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజానీకానికి సమాధానం చెప్పాలన్నారు. 2014 ఎన్నికల ముందు విభజన హామీలను అమలు చేస్తామని బాబు, మోదీ అధికారాన్ని కైవసం చేసుకున్నారని, విస్మరించారని ఆరోపించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలన్నారు.జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి. నిర్మల, టి. రాముడు, పీఎస్. రాధాక్రిష్ణ, జి. రామక్రిష్ణ, కే. వెంకటేశ్వర్లు, కేవీ. నారాయణ, గురుశేఖర్ పాల్గొన్నారు.

మూడేళ్లలో పెరిగిన జడ్పీ ఆదాయం

చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు న్యూసిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాలక వర్గం ఏర్పడిన మూడేళ్లలో జిల్లా పరిషత్ ఆదాయాన్ని అమాంతం పెంచినట్లు చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జడ్పీ కార్యాలయం లోని చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక స్టాండింగ్, సర్వసభ్య సమావేశాలు అర్థవంతంగా జరుగు తున్నాయన్నారు. సభ్యుల ప్రశ్నలకు అధికారులు సమా ధానాలు చెబుతున్నారని అన్నారు. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూ ఎస్, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖలను మాత్రమే సమావేశాల్లో అజెండాగా చేరుస్తున్నామన్నారు. 2014-2019 వరకు జడ్పీ ఆదాయం కేవలం రూ.5 కోట్లు ఉందని, 2022-2025 వరకు కేవలం మూడేళ్లలో రూ44 కోట్లు పెంచామన్నారు. అధికారుల సహకారంతోనే నిధులు రాబడుతున్నామని చైర్మన్ తెలిపారు. జిల్లా పరిషత్ పాత భవనాన్ని టూరిజానికి అప్పగించడంతో పాటు పురాతన భవనాలను కాపాడుతున్నామని అన్నారు. సాధారణ నిధులకు మే వరకు పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యాయన్నారు. జూన్ నుంచి ఇంకా రూ.7కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీల వేతనాలు జూన్ నుంచి డిసెంబరు వరకు సుమారు రూ.29 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. జిల్లాలో రిజర్వాయర్లు నిర్మిస్తే తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో చర్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జుపాడుబంగ్లా, గూడూరు జడ్పీటీసీలు పోచా జగదీశ్వరరెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 122 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 13 గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 122 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు మండలంలోని టీఎస్ కల్లూరు గ్రామంలో 6, కోసిగి మండలం కోసిగిలో 13, కౌతాళం మండలంలోని కామవరంలో 24, మంత్రాలయం మండలం వగరూరులో 3, పెద్దకడుబూరు మండలం పెద్దకడుబూరులో 18, ఆదోని మండలం జి. హోసలిలో 12, గనేకల్లులో 6, హొళగుంద మండలం పెద్దగోనేహాల్‌లో 13, కోసిగి మండలం పెండేకల్‌లో 4, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కల్లూరు మండలం తడకనపల్లిలో 8, కర్నూలు రూరల్‌లోని సుంకేసులలో 7, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని ఆలూరు మండలం పెద్దహోతూరులో 5, ఆస్పరి మండలం ముత్తుకూరులో 3 అర్జీలు వచ్చాయన్నారు. బుధవారం 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు.

పకడ్బందీగా జీఎన్ఎం పరీక్షలు

కర్నూలు హాస్పిటల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీఎన్ఎం నర్సింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో పరీక్షలను తనిఖీ చేశారు. ప్రతి కేంద్రానికి ఒక వైద్యాధికారిని నియమించామన్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాపీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, పరీక్షలు పారదర్శకంగా నిర్వహించ డానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తనిఖీ అధికారిగా డా.కిరణ్ కుమార్‌ను నియమించామన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద కాపీ చీటీలు..

పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా జీఎస్ఎం కాలేజీ యజమానులు ఒక్కో విద్యార్థి నుంచి రూ.7వేలకు పైగానే వసూలు చేసినట్లు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఇక పరీక్ష కేంద్రాల బయట మైక్రో జిరాక్స్ పేపర్లు కుప్పలు కుప్పలుగా పడి ఉండటం, కాపీయింగ్‌కు కొందరు ఇన్విజిలేటర్లు సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఓ క్లర్కుకు అనుకూలంగా కొందరు ఇన్విజిలేటర్లు పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



పరీక్ష కేంద్రం వద్ద పడి ఉన్న మైక్రో జిరాక్స్ చీటీలు

మళ్లీ వైరస్ టెన్షన్..

- సీఎం టెలీ కాన్ఫరెన్స్
- జీజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు



హెచ్‌ఎంపీవీ వైరస్ వార్డును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ పుట్టిన చైనా నుంచి మరో మహమ్మారి వ్యాప్తి చెందుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతున్నది. కొద్ది రోజులుగా చైనాలో హ్యూమన్ మెటన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వ్యాప్తి చెందుతోంది. మన దేశంలో కూడా హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు వెలుగు చూడటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ గైనిక్ విభాగంలో 20 పడకల హెచ్‌ఎంపీవీ వైరస్ విభాగాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కేసుల దృష్ట్యా ఆసుపత్రిలోని హెచ్‌ఎంపీవీ వైరస్‌ను ఎదుర్కోడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో ఎలాంటి హెచ్‌ఎంపీవీ వైరస్ కేసు నమోదు కాలేదన్నారు. ఫల్మనాలజీ, అనస్థీషియా, మెడిసిన్, మైక్రో బయాలజీ ఎస్‌పీఎం, పీడియాట్రిక్ వైద్యులు అందు బాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డా.కే. సీతారామయ్య, డా.డి. శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, వైస్ ప్రిన్సిపాల్ డా. రేణుకాదేవి, ఫల్మనాలజీ హెచ్‌వోడీ డా.శ్రీకాం త్, అనెస్థీషియా ప్రొఫెసర్ డా.శ్రీకాంత్, మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరుగురు వైద్యులతో ఎక్స్‌పర్ట్ కమిటీ :

- మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డా. రేణుకాదేవి
- ఎస్‌పీఎం విభాగాధిపతి డా. సుధాకుమారి
- పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా. విజయానంద్‌బాబు
- జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డా. ఇక్బాల్ హుసేన్
- పల్మనాలజీ మెడిసిన్ హెచ్‌వోడీ డా. శ్రీకాంత్
- అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాలను

నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన సేవ



పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి

నంద్యాల కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామికి మంగళవారం 108 స్వర్ణపుష్పములతో అష్టోత్తర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరునికి పంచామృత అభిషేకం, అలంకరణ, హారతి కార్యక్ర మాలు నిర్వహిం చారు. తదుపరి మూల విరాట్‌కు అష్టదళ పూజ చేశారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు శ్రీనివాస్, పార్థసారధి క్రిష్ణ, అర్చకులు శ్రీకాంత్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

'మెరుగైన వైద్యం అందించాలి'



తిమ్మాపురం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీపీ

మహానంది, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మహానంది మండల అధ్యక్షురాలు యశస్విని సూచించారు. మహానంది మండలంలోని తిమ్మాపురం, గాజులపల్లి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఎంపీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యం కోసం వచ్చే వారిలో మనోధైర్యం నింపి చికిత్సలు నిర్వహించాలని వైద్యులు భగవాన్‌దాస్, వెంకటరెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేంద్రుడు, ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, సిబ్బంది అమీనాబీ పాల్గొన్నారు.

28 నుంచి జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలు



పోస్టరును విడుదల చేస్తున్న క్రీడా భారతి ప్రతినిధులు

నంద్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాభారతి ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు జాతీయ స్థాయి జూనియర్ బాల, బాలికల సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, నిమ్మకాయల సుధాకర్ తెలిపారు. నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో మంగళవారం జాతీయ స్థాయి క్రీడా పోటీల పోస్టర్లన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే క్రీడా పోటీలకు దేశంలోని 26 రాష్ట్రాల నుంచి దాదాపు 500మంది క్రీడాకారులు, వందమంది కోచ్‌లు, అఫీషియల్స్ వస్తున్నట్లు చెప్పారు. నంద్యాల ఎస్బీఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాలలోని కాశిరెడ్డి నాయన ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తున్నవారికి రామకృష్ణ పీజీ కాలేజీలో వసతి కల్పిస్తున్నామని, భోజన సౌకర్యానికి దాతల సహకారంతో చేపడతామన్నారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, శ్రీధర్, క్రీడాభారతి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

నందికొట్కూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని నారాయణ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పూజిత, యామిని, సుమంత్ శ్రీరామ్ అనే విద్యార్థులు జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. నారాయణ పాఠశాలల అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, రీజనల్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ సునీత, స్కూల్ ప్రిన్సిపల్ మాధవి, డీన్ శ్రీకాంత్ రాష్ట్ర స్థాయికి ఎన్నికైన విద్యార్థులను అభినందించారు.

అంగన్‌వాడీ టీచర్‌పై వ్యక్తి దాడి



తీవ్రంగా గాయపడ్డ జయలక్ష్మి

పాణ్యం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మరాజుపల్లె అంగన్‌వాడీ టీచర్ జయలక్ష్మిపై అదేగ్రామానికి చెందిన శివకుమార్ అనేవ్యక్తి పాత గొడవలు మనసులో పెట్టు కొని దాడికి పాల్పడి గాయపర్చి నట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మంగళ వారం అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న తనపై దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారని చెప్పారు. తప్పతాగిన శివకుమార్ బూతు లతో కిందపడేసి కాళ్లతో తన్నుతూ రాడ్‌తో కొట్టడంతో కన్నుకు తీవ్రంగా గాయమైనట్లు తెలిపారు. విధులకు ఆటంకం కలిగించ డంతో పాటు ఉద్యోగం చేస్తే చంపేస్తానని బెదిరించినట్లు ఆమె ఫిర్యాదు చేశారు. తీవ్రంగా గాయపడిన జయలక్ష్మిని హుటాహుటిన నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ తమ్మరాజుపల్లెకు వెళ్లి విచారించి ఎంఎల్‌సీ ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

'నిందితుడిపై చర్యలు తీసుకోవాలి'

అంగన్‌వాడీ వర్కర్‌పై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మలమ్మ, సునీత డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు భద్రత కల్పించాలని, నిందితుడిపై చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విధుల్లో ఉండగా దాడికి పాల్పడడంతో కేంద్రంలోని చిన్నారులు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల వెంకట్ హెచ్చరించారు.

విభజన హామీలు నెరవేర్చాలి: సీపీఎం



నందికొట్కూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

నందికొట్కూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న విభజన హామీలను నెరవేర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గో బ్యాక్ అంటూ నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్నానికి రానున్న నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకపోగా... వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రతి సంవత్సరం రూ.50 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ కింద కేటాయిస్తామని ఇచ్చిన హామీలను అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి, పోలవరం నిర్మాణానికి నిధుల కేటాయింపులో కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, మారెన్న, ఉస్మాన్‌బాషా, సలాంఖాన్, రంగమ్మ, హుస్సేనమ్మ, జయరాణి తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలపై అవగాహన



యంత్రం పనితీరును పరిశీలిస్తున్న విద్యార్థినులు

పాణ్యం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ల్యాబ్‌లలో మంగళవారం పాణ్యం కేజీబీవీ విద్యార్థినులకు యంత్రాలపై అవగాహన కల్పించారు. బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా పదో తరగతి బాలికలు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఆర్జీఎం కళాశాలలో మెకానికల్ ల్యాబ్‌లను సందర్శించినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కళ్యాణి తెలిపారు. ల్యాబ్‌లలో బాలికలకు మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు జయశంకర్, పాండురంగస్వామి బాలికలకు యంత్రాల పనితీరు, వాటి ఉపయోగం, విభాగాల పేర్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు అరుణకుమారి, ఎలిజబెత్, రూప తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ వేధింపులు ఆపాలి'



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

బండిఆత్మకూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులపై రాజకీయ వేధింపులు తక్షణమే ఆపాలని సీఐటీయూ మండల నాయకులు రత్నమయ్య, రాజు డిమాండ్ చేశారు. మంగళవారం బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట భోజన కార్మికులతో కలసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఎలాంటి అభియోగాలు లేకపోయినా నారాయణపురం, బండిఆత్మకూరు హైస్కూల్‌లలో నిర్వాహకులను దిగిపోవాలని అధికారులతో ఒత్తిడి చేస్తున్నారని, వేధింపులు ఆపకపోతే పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డీటీ గురునాథంను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, శంకరమ్మ, జమ్రుద్, సుశీలమ్మ, రమీజాబీ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నివాళి

మహానంది, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహానంది గ్రామానికి చెందిన వన సంరక్షణ సమితి అధ్యక్షుడు కేసీ శేఖర్(60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పలువురు మండల టీడీపీ నాయకులతో పాటు రెవిన్యూ సిబ్బంది సందర్శించి, నివాళి అర్పించారు. గత 35 సంవత్సరాల నుంచి మహానంది అటవీ వనసంరక్షణ సమితి అధ్యక్షుడితో పాటు చౌకదుకాణం రేషన్ డీలరు గా కొనసాగారు.

'ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులను నమ్మించి మోసం చేస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు శివారులోని ఓ ప్రైవేట్ గోదాములో ఓ కంపెనీ రైతుల నుంచి చుక్కబర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్న తీరును సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది చుక్కబర్లీ పొగాకు అధిక డిమాండ్ పలకడంతో ఈ ఏడాది అధిక సంఖ్యలో రైతులు ఈ పంటను సాగు చేశారన్నారు. పొగాకు నార మొదలుకొని బేళ్ల రూపంలో కంపెనీ వద్దకు తీసుకొచ్చే దాకా రైతుకు ఎకరాకు రూ.60 నుంచి 70 వేల వరకు ఖర్చు వస్తోందని చెప్పారు. ఇలా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పండించారన్నారు. ఇలా పండించిన పంట రూ.15 వేలకు పైగా ఉండగా.. నాణ్యత పేరుతో రూ.12,500 వరకు కోత విధిస్తూ కంపెనీ రైతులను మోసం చేస్తోందన్నారు. రైతులను మోసం చేస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'కౌలు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి'



రైతులతో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ నాగరాజు

బండిఆత్మకూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన కౌలు రైతులు రుణాల కోసం దరఖాస్తు చేసకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ నాగరాజు సూచించారు. ఎ.కోడూరు రైతు సేవా కేంద్రంలో మంగళ వారం ఏవో స్వాతి అధ్యక్షతన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో కౌలుకు పంటలు సాగు చేసిన రైతులకు కౌలు కార్డులు కల్గి ఉండి ఉంటే రుణాలకు దరఖాస్తులు చేయాలన్నారు. ఏవో స్వాతి మాట్లాడుతూ రబీ పంటలకు బీమా చెల్లింపునకు ఈనెల 15 వరకు గడువు ఉందని, రైతులు బీమా చెల్లించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ అధ్యక్షుడు హిందు శేఖర్‌రెడ్డి, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఏవో హేమసుందర్‌రెడ్డి

గడివేముల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాలకట్ట గ్రామంలో మంగళవారం కౌలు రైతులకు పంట రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులు రుణం సదుపాయం కావాలంటే కేసీసీ ఫారం ఇవ్వాలని అన్నారు. అనంతరం రైతులకు పంటసాగులో తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'క్రీడల్లోనూ రాణించాలి'



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిందాల్ సిబ్బంది

గడివేముల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సీఎంవో సుమిత్ చౌద, యూనిట్ హెడ్ నవనీత్ చౌహాన్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో మండలంలోని 12 పాఠశాలలకు చెందిన 580 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. క్యారమ్స్, చెస్, ఖోఖో, కబడ్డీ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. క్యారమ్స్ పోటీల్లో అండర్-14 విభాగంలో కరిమద్దెల హైస్కూల్‌కు చెందిన సాయిమణి, సమీరాలు మొదటి స్థానం, కేజీబీవీకి చెందిన శ్రీలత, వెంకటేశ్వరి ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-17 విభాగంలో రాజరాజేశ్వరి హైస్కూల్‌కు చెందిన భారతి, వైష్ణవి మొదటి స్థానం, సెయింట్‌పాల్‌కు చెందిన రచన, యశస్విని రెండో స్థానంలో నిలిచారు. అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, గని హైస్కూల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సీతారామిరెడ్డి, ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం విక్టర్ ఇమ్రామనుయేల్, జిందాల్ సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మహానంది, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన డమాల పాములేటి(72) చికిత్స పొందుతూ మృతి చెందారు. పాములేటి సోమవారం సొంత పనిమీద నంద్యాలకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వస్తున్న పాములేటిని మార్గమధ్యలోని బుక్కాపురం ప్రధాన రహదారి అలుగు వద్ద ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మహానంది పోలీసులు తెలిపారు.

ఫౌండేషన్ సీడ్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలి: ఏడీఏ



మాట్లాడుతున్న ఏడీఏ విజయశేఖర్, శిక్షణలో పాల్గొన్న వ్యవసాయశాఖ సిబ్బంది

నందికొట్కూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ సీడ్ ద్వారా మేలిరకమైన విత్తన ఉత్పత్తిని దిగుబడి తీసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎంపీఈవోలను సూచించారు. మంగళవారం గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంపై రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విజయశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ విత్తన ఉత్పత్తి యొక్క ముఖ్య ఉద్దేశం రైతులకు ఫౌండేషన్ సీడ్ అందజేసి... వాటి ద్వారా మేలిరకం విత్తనం తయారు వరకు ఆ పంటను ఎలా సాగు చేయాలన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇక్కడే ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండేందుకు ఫౌండేషన్ సీడ్‌ను రైతుల వద్దే సమృద్ధిగా మార్చి వచ్చిన విత్తనాన్ని రైతులకు సరఫరా చేయడం గ్రామీణ విత్తన ఉత్పత్తి యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం బీపీటీ 5204 రకాన్ని గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం కింద రైతులకు అందజేశారు.

కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారి కలీమున్నీసా, నందికొట్కూరు, మిడ్తూరు ఏవోలు షేక్షావలి, పీరు నాయక్ రైతు సేవ కేంద్రం సిబ్బంది, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

మాన్యం ఆక్రమిస్తే చర్యలు

- పరిశీలించిన మహానంది ఆలయ ఈవో



కొత్తపల్లిలో మాన్యాన్ని పరిశీలిస్తున్న మహానంది ఆలయ ఈవో

మహానంది, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మాన్యాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామం సమీపంలో మహానంది దేవస్థానానికి చెందిన భూములను పరిశీలించారు. ఈ భూమిని కొందరు ఆక్రమించుకొని సాగు చేసుకొంటున్నట్లు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఆయన పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ ఆక్రమిత మాన్యాన్ని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. వీరి వెంట ఏఈవో ఎర్రమల్ల మధు, సీనియర్ అసిస్టెంట్ పసుపుల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్న రాధిక

ఆత్మకూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మంగళవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ఆయా రెవెన్యూ గ్రామాల్లో రైతుల నుంచి ఏవైనా భూసమస్యలపై అర్జీలు అందించినట్లయితే వాటిని పరిశీలించి 15 రోజుల్లోగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భూసమస్యలు కలిగిన రైతుల నుండి అర్జీలను స్వీకరించారు. రైతుల నుంచి 6 అర్జీలు స్వీకరించామని, ఆయా సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ల్యాండ్ సర్వే అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సదస్సులు

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. కొత్తపల్లి గ్రామ సచివాలయ ఆవరణంలో తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కొత్తపల్లిలో భూ కొలతల కోసం 8 దరఖాస్తులు రాగా, పాసు పుస్తకాల కోసం 6 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డిసెంబరు 6వ తేదీ ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. మండలంలో నెల రోజులుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, మండల సర్వేయర్ అనూష, వీఆర్వోలు బాబుమియా, వేణుగోపాల్, రామసుబ్బయ్య, అశోక్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు యాదవ్, మోహన్ యాదవ్, గ్రామ సర్వేయర్ అబ్దుల్ మన్నన్ పాల్గొన్నారు.

'సైబర్ భద్రతను నిర్ధారించడం కీలకం'

పాణ్యం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వేగవంతమైన డిజిటల్ మార్పుల యుగంలో సైబర్ భద్రతను నిర్ధారించడం అత్యంత కీలకమని సావరీ మైండ్స్ సీఈవో అమిత్ కుమార్ అన్నారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అంశంపై అవగాహన సదస్సు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ ముప్పులను గుర్తించడం, రిస్క్ మేనేజ్‌మెంట్ డేటా రక్షణ, సైబర్ సెక్యూరిటీలో కొత్తగా వస్తున్న సాంకేతికత వంటి విభిన్న అంశాలను కవర్ చేస్తుందని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్ లక్ష్మీ చైతన్య, హెచ్‌వోడీ ఫరూక్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

ఆత్మకూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలానికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 2025 నూతన క్యాలెండర్, డైరీని ఎంఈవో-1,2 బాలాజీనాయక్, సురేష్ ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులందరు విద్యార్థుల ప్రగతి కోసం పాటుపడాలని కోరారు. ప్రత్యేకించి ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కమతం శంకర్, జిల్లా సహాధ్యక్షులు ఎంఎస్ ఉమ్మర్ మాట్లాడుతూ.. ఏపీటీఎఫ్ నిరంతరం సమాజ శ్రేయస్సు, విద్యా ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం కోసం శ్రమిస్తుందని అన్నారు. ఈ నెల 11వ తేదిన శనివారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సంస్మరణ సభకు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ల అబ్దుల్ వహీద్, కృష్ణుడు, జిల్లా నాయకులు విధుభూషణ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

కుక్కల స్వైర విహారం



గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

గడివేముల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గడివేములలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రహదారిపై గుంపులు గుంపులుగా సంచరిస్తూ పిల్లలు, పెద్దలను, వాహనదారులను వెంబడించి దాడి చేస్తున్నాయి. ఇటీవల గడివేముల, చిందుకూరు గ్రామాల్లో కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. కుక్కల సంతతిని నియంత్రించాలని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వందశాతం లక్ష్యాలను సాధించాలి

శిరివెళ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం లక్ష్యాలను సాధించాలని డీఈవో జనార్దన్ రెడ్డి సూచించారు. శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. వంద రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా పాఠశాలలో అమలు చేస్తున్న కార్యాచరణను పరిశీలించారు. జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, శర్మ, శ్రీనివాసులు, నాగపుల్లయ్య, గురువయ్య, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవో న్యామతుల్ల ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఓజీ తండా, డి.వనిపెంట గ్రామాల్లోగల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వన్నూర్‌బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను గుర్తించాలి



డోన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

డోన్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జులైఖ, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు తన హామీని నిలబెట్టుకోవలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో, సిబ్బంది

బేతంచెర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రం ఆలయ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను, డైరీని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ ఆరోగ్య శ్రీ లోగోతో క్యాలెండర్


వైఎస్సార్ లోగో ఉన్న పీఆర్టీయూ క్యాలెండర్

ఉయ్యాలవాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్టీయూ నాయకులు విడుదల చేసిన 2025 నూతన క్యాలెండర్‌లో వైఎస్సార్ ఆరోగ్య శ్రీతో ఉన్న లోగో ముద్రించటంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. 2025 నూతన క్యాలెండర్‌ను మండల పీఆర్టీయూ నాయకులు మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలకు వచ్చిన డీఈవో జనార్దన్‌రెడ్డితో విడుదల చేయించారు. ఈ కాలెండర్లను అక్కడ ఉన్న ఉపాధ్యాయులకు అందించారు. తీరా చూస్తే అందులో నంద్యాల పట్టణానికి చెందిన మధు చిన్న పిల్లల హాస్పిటల్ వారు ఇచ్చిన యాడ్‌లో జూలై పేజీలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సౌకర్యం కలదని ముద్రించి ఉంది. అంతే కాకుండా దివంగత ముఖ్యంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల ఫోటోలతో ఉన్న లోగోను అందులో ముద్రించారు. అయితే దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ
- బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల)/దొర్నిపాడు జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.06 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పట్టణంలోని కార్యాలయంలో బాధితులకు ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. ఇందులో దొర్నిపాడు మండలం చాకరాజవేముల గ్రామానికి చెందిన గురుప్రసాద్‌కు రూ.1.81 లక్షలు, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన ప్రసాద్‌కు రూ.25 వేల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాకరాజువేముల నీటి సంఘం అధ్యక్షుడు లింగుట్ల వెంకట్‌నాయుడు, ఎండూరి గోపాల్‌నాయుడు, కేశవనాయుడు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ విజయ్ కుమార్, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాస్

బనగానపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బనగానపల్లె పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దుస్తుల యజమానులు, కిరాణా దుకాణం యజమానులు, బేకరీ యజమానులు, కూరగాయల వ్యాపారులు తదితర వ్యాపారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మలు పట్టణం పరిశుభ్రంగా ఉంచేందుకు, ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రతి వ్యాపారి ఇందుకు సహకరించాలన్నారు. బనగానపల్లె నుంచే ప్లాస్టిక్‌నిషేదంపై మార్పులు రావాలన్నారు. ప్లాస్టిక్ ఎక్కడిక్కడ వేయడం వల్ల మూగ జీవాలు ప్లాస్టిక్‌ను తిని మృతి చెందుతున్నాయని ఇది బాధాకరమన్నారు. అలాగే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలను చిన్నప్పట్నుంచే సైకిల్ తొక్కేది నేర్పించాలన్నారు. బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం సక్సెస్ అయితే జిల్లా వ్యాప్తంగా అమలులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ వ్యాపార వర్గాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా బోధనపై దృష్టి పెట్టండి: డీఈవో


మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

ఉయ్యాలవాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు యుగో భావన పక్కనపెట్టి విద్యా బోధనపై దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆదర్శ, బోడెమ్మనూరు గ్రామ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కుటుంబసభ్యుల్లా కలిసి ఉండాలే కానీ ఘర్షణ పడకూడదన్నారు. ఇలాంటివి తన దృష్టికి వస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఏడాదిలో జరిగే పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. విధుల్లో సమయపాలన పాలన పాటించాలన్నారు. లేకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పది పబ్లిక్ పరీక్షల్లో నంద్యాల జిల్లా టాప్ టెన్‌లో ఉత్తీర్ణత సాధించటంపై దృష్టి పెట్టినట్లు డీఈవో సూచించారు. కాగా, పీఆర్టీయూ క్యాలెండర్, డైరీని డీఈవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో 1 అనురాధ, ఎంఈవో 2 ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శివారెడ్డి, మాబుపీరా, శ్రీనివాసులు, నూర్జహాన్, ఆదాము తదితరులున్నారు.

'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయాలి'

డోన్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. మంగళవారం బహుజన స్టూడెంట్ ఫెడరేషన్, ఆర్‌ఎస్‌ఎస్, ఎంఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి పాతబస్టాండు మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం ఇన్ చార్జి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు విజయభాస్కర్, ఆర్‌ఎస్‌ఎస్ రాయలసీమ జోన్ ఇన్‌చార్జి చిరంజీవి, ఎంఎస్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివన్న, కాంగ్రెస్ నాయకులు గోపినాథరావు, ఖాజా, బాలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ అధికారుల దాడులు

కొలిమిగుండ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామ సమీపంలోని నాపరాతి గనుల్లో అక్రమ మైనింగ్‌పై జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మంగళవారం నంద్యాల మైనింగ్ విజిలెన్స్ అధికారి శ్రీనివాసరెడ్డి, మరి కొంత మంది అధికారులు బెలుం గ్రామ సమీపంలోని నాపరాతి గనుల వద్దకు చేరుకొని, పలు క్వారీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అనుమతులు లేకుండా గనుల్లో కటింగ్ కోస్తున్న రెండు మిషన్లు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

అవినీతికి పాల్పడ్డ బుక్ కీపర్లపై చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో అవినీతికి పాల్పడిన బుక్ కీపర్లపై చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బనగానపల్లె వెలుగు కార్యాలయంలో పీడీ ఏపీఎం శ్రీనివాస్‌తో పొదుపు గ్రూపులపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండల సమాఖ్య అభివృద్ధి బాటలో పయనింపచేయాలని కోరారు. చాలా మంది బుక్ కీపర్లు సక్రమంగా పని చేయడం లేదని తన దృష్టికి వచ్చిందని అలాంటి వారిని ఉపేక్షించేంది లేదన్నారు. కార్యక్రమంలో ఐబీ యాంకర్ పర్సన్ ఏపీఎం కృష్ణమూర్తి, పొదుపు లీడర్లు, బుక్ కీపర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

బనగానపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని ఇల్లూరు కొత్తపేట ఉన్నతపాఠశాలను, బనగానపల్లె బాలికల ఉన్నతపాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల కనీస వసతులను గురించి, పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎంఈవో కార్యాలయాన్ని, కేజీబీవీ పాఠశాలను కూడా తనిఖీ చేశారు. ఇల్లూరుకొత్తపేట ఉన్నతపాఠశాలలో తయారవుతున్న కెమిస్ట్రీ ల్యాబ్ వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవో స్వ రూప, హెచ్‌ఎంలు గంగాధర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో ఉమ్మడి జిల్లాలో బనగానపల్లె టాప్

బనగానపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో ఉమ్మడి జిల్లాల్లోనే బనగానపల్లె నియోజకర్గం టాప్‌లో నిలిచింది. మొత్తం 14 నియోజకవర్గాల్లో గత రెండు నెలల నుంచి జోరుగా టీడీపీ సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. తొలుత నత్తనడకగా సాగిన టీడీపీ సభ్యత్వ నమోదు తర్వాత పుంజుకుంది. ముఖ్యంగా రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంతో సభ్యత్వం ఊపందుకుంది. ఇప్పటి వరకు నంద్యాల, కర్నూలు జిల్లాల్లో బనగానపల్లె నియోజకవర్గంలో 61వేలకుపైగా సభ్యత్వనమోదు చేసి టాప్‌లో నిలిచింది. ఇంకా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అధికంగా సభ్యత్వాలు నమోదు చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

పొలాన్ని ఆక్రమించుకున్నారు

- మహిళా రైతు తహసీల్దారుకు ఫిర్యాదు


బాధితురాలు పుల్లమ్మ

ప్యాపిలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తన పుట్టింటి వారు పసుపు, కుంకుమ కింద ఇచ్చిన పొలాన్ని సమీప బంధువు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని మండలంలోని రాచెర్ల గ్రామానికి చెందిన పుల్లమ్మ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. పొలాన్ని సర్వే చేసి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దారు భారతికి ఆమె వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాచెర్ల గ్రామంలో తన పుట్టింటి వారు పసుపు, కుంకుమ కింద 475-3 సర్వే నెంబరులో 2.50 ఎకరాల భూమి ఇచ్చారన్నారు. అయితే సమీప బంధువు అరఎకర పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకొని తన పొలంలో కలుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలానికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని మహిళ ఆరోపించారు. ఉన్నతాధికారుల స్పందించి న్యాయం చేయాలని కోరారు. విషయంపై తహసీల్దారు స్పందిస్తూ తాను కొత్తగా వచ్చానని, స్థానిక వీఆర్వోతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు.

సాదాసీదాగా మండల సమావేశం

రుద్రవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం సాదాసీదాగా కొనసాగింది. అధికారులు తమ శాఖల నివేదికలు చదివి వినిపించారు. ఎంపీడీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు సమస్య తలెత్తితే తమ దృష్టికి తేవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యవంతంగా అందించాలన్నారు. సంబంధితశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో పశువైద్యాధికారులు నాగప్రసన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుబ్రమణ్యం, ఏపీవో ప్రతాప్, ఈసీ సుబ్బన్న, ఇంకా పలువురు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి

బేతంచెర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరుమానుకొండ తండాకు చెందిన నేనావత్ పట్టాభి నాయక్ (38) అనే టీడీపీ కార్యకర్త కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టాభినాయక్ అంత్యక్రియలు బుధవారం నిర్వహిస్తున్నట్లు మృతుడి సోదరుడు రవీంద్ర నాయక్ తెలిపారు.

'కౌలు రైతులకు పంట రుణాలు అందిస్తాం'

బేతంచెర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కౌలు రైతులకు పంట రుణాలు అందిస్తామని చిన్న మల్కాపురం యూనియన్ బ్యాంకు మేనేజర్ జగదీష్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామంలో, చిన్నమల్కాపురం యూనియన్ బ్యాంకు మేనేజర్ జగదీష్ కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుదారు పత్రాలు తీసుకున్న కౌలు రైతులకు పంట రుణాలు అందిస్తామన్నారు. పంట రుణాలు కావాల్సిన రైతులు తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, ఏఈవోలు బెన్నిరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రఖ్యాతి, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవాలి

బనగానపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కంది పంట వేసిన రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని పాతపాడు, పసుపుల గ్రామాల్లోని రైతులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7550లు ప్రకటించిందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల యాజమాన్యాన్ని గురించి ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండు తెగులు నివారణకు చర్యలు చేపట్టండి

ఉయ్యాలవాడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శనగ పంటకు సోకిన ఎండు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలని కోవెలకుంట్ల డివిజన్ ఏడీఏ సుధాకర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు గ్రామాల్లో బీటీయం ఉమమహేశ్వరితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా శనగ పంటను పరిశీలించి పంటకు ఎండు తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి మందులు పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే శనగ పంట తరువాత మినుము లేదా కొర్ర పంటలు సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. సమావేశంలో వీఏఏ జగన్‌మోహన్, రైతులు ఉన్నారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

కొలిమిగుండ్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు. హిందువుల పర్వదినాల్లో వైకుంఠ ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈరోజు ఉత్తర ద్వారమున స్వామి వారిని దర్శించుకుంటే ఎంతో పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. మండలంలోని కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినిపేట, కొలిమిగుండ్ల, తదితర అనేక గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి కోసం ఏర్పాట్లు చేపడుతున్నారు.

అవుకులో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

అవుకు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అవుకు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 11నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను జడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుజిత్, రామ చంద్రుడు, శేఖర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సుజిత్ మాట్లాడుతూ మొదటి బహుమతి రూ. 10వేలు, రెండవ బహుమతి రూ. 5వేలు, మూడవ బహుమతి రూ. 2వేలుగా ప్రకటించారు. పాల్గొనే క్రీడాకారులు ఈనెల 10వతేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

కోవెలకుంట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు రబీలో సాగు చేసిన వరిపైరుకు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుళ్లదుర్తిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అధికారులు, వ్యవసాయ సిబ్బంది, గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

చాగలమర్రి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వందశాతం ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేయాలని ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్చి చివరి లోపు వందశాతం పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పన్నుల వసూలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన సర్వే వేగవంతం

చాగలమర్రి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని ఎన్యూమరేటర్లు సర్వేను వేగవంతం చేయాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. మంగళవారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటూ తమకు నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని తెలిపారు. ఎద సూదులు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, పాడి రైతులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా మైదానం శుభ్రం

కోవెలకుంట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాలేజీ క్రీడా మైదానాన్ని పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. మంగళవారం ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు, టీడీపీ నాయకుడు కార్టెడ్డి మల్లిఖార్జునరెడ్డితో కలిసి గ్రామ పంచాయతీ సిబ్బందితో కాలేజీ గ్రౌండ్‌లో పడిన ప్లాస్టిక్ బాటిళ్లను, గ్లాసులు, సీసాలను ఎత్తి వేయించి చెత్త సంపద కేంద్రానికి తరలించారు. ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని విద్యార్థులు సమస్యను ఈవోఆర్‌డీ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి సిబ్బందితో శుభ్రం చేయించారు.

గోదాదేవికి విశేష పూజలు


చాగలమర్రి కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని కోదండరామాలయంలో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం గోదాదేవి అమ్మవారికి మహిళలు సామూహికంగా విశేష పూజలు చేశారు. విష్ణుసహస్రపారాయణం చేశారు. సీతారాముల పల్లకితో ఉత్సవం చేశారు. మద్దూరు గ్రామంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామికి వేద పండితుడు కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 10న ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు. ఉత్తర ముఖద్వారంగల దేవాలయం కావడంతో ప్రత్యేక విశిష్టత ఉందని అన్నారు. 11న వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుగుతుందని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

20 నుంచి లెప్రసీ కేసుల గుర్తింపు

డోన్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఈ నెల 20నుంచి లెప్రసీ కేసుల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాంభూపాల్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు, హెల్త్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టర్లను విడుదల చేశారు.

బనగానపల్లెలో నేడు ముగ్గుల పోటీలు

బనగానపల్లె, జనవరి 7, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం ముగ్గుల పోటీలు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఉన్నతపాఠశాల మైదానంలో ఈ ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జడ్పీ మైదానంలో శేఖర్ సహకారంతో దువ్వూరు కళాకారులతో కోలాటం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, జనవరి 7, (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంచాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్, ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు అడిగితే ఇవ్వరాదన్నారు. సమావేశంలో మద్దిలేటి, రామలక్ష్మి, ఆంజనేయులు, అశోక్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.